మృతిచెందిన కార్మికుల పిల్లలకు నష్టపరిహారం

చిక్కడపల్లి, జూలై 4 : తల్లిదండ్రులను కోల్పోయిన కార్మికుల పిల్లలకు తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా మంజూరైన డిపాజిట్లను గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో డీసీఎల్ చంద్రశేఖర్ గౌడ్ అందజేశారు. ఇటీవల కొల్లాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికులైన భార్యాభర్తలు మృతి చెందారు. వారి ముగ్గురు పిల్లలకు రూ. 4.20 లక్షల చొప్పున సంబంధించిన డిపాజిట్లను అందజేశారు.

సాంస్కృతిక కళాబంధు సారిపల్లికి సత్కారం

రవీంద్రభారతి, జూలై 4 : యువక కళావాహిని జంటనగరాల సాంస్కృతిక సంస్థల సమన్వయంతో గురువారం సాంస్కృతిక కళాబంధు సారిపల్లి కొండల్‌రావు సహస్ర పూర్ణ చంద్రదర్శన మహోత్సవం రవీంద్రభారతిలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, డాక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం విచ్చేసి సారిపల్లిని పూలమాలతో సత్కరించారు. లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అవకాశం కల్పించాలి

చిక్కడపల్లి : వాయిద్య కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్‌వీ చెన్నారావు గురువారం తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణను కలిశారు. ఈ సందర్భంగా చెన్నారావు మాట్లాడుతూ.. ఆషాఢమాస బోనాలకు పెద్ద ఎత్తున కళాకారులకు అవకాశం కల్పించాలని కోరారు. భరత్, శ్రీనివాస్, నాగేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూలై 4: పర్యావరణ పరిరక్షణను ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి విధిగా మొక్కలు నాటాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. గురువారం హరితహారం కార్యక్రమంలో భాగంగా అడిక్‌మెట్ డివిజన్, అచ్యుతరెడ్డి మార్గ్‌లో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యావరణ హితం కోసం మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రతి యేటా ప్రభుత్వం చేపట్టడంతో పాటు పార్టీలు, సంఘాలు తమవంతు బాధ్యతగా నిర్వర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యమంగా చేపట్టిన హరితహారం నేడు చక్కటి ఫలితాలను ఇస్తుందని, తెలంగాణ ప్రాంతాన్ని ఆకుపచ్చ తెలంగాణగా మార్చేసిందన్నారు. బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జయసింహ, రామాలయం చైర్మన్ డి.రవియాదవ్, ఖలీల్, అనూరాధ, ధర్మ, ప్రవీణ్, నాగులు,హరీశ్, ప్రియాంక, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం..

కవాడిగూడ డివిజన్, మోతీలాల్ నెహ్రూనగర్ బస్తీలో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఠా జయసింహ, సాయికృష్ణ, రాంచందర్, ప్రభాకర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా తాగునీటి, డ్రైనేజ్ పైప్‌లైన్ల ఆధునీకరణ : ఎమ్మెల్యే

చిక్కడపల్లి : ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా మంచినీటి, డ్రైనేజ్ పైప్‌లైన్ల ఆధునీకరణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్

అచ్యుతరెడ్డి మార్గ్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అన్నారు. గురువారం కవాడిగూడ డివిజన్, లోయర్ ట్యాంక్ బండ్ మోతీలాల్ నెహ్రూనగర్‌లో నూతనంగా రూ. 6.5 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కలుషిత నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించే దిశగా, అవసరం ఉన్న చోట నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జయసింహ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, నాయకులు రాంచందర్, రాజేశ్, రవి యాదవ్, మధు, శ్రీకాంత్, మాధవి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి శివశంకరికి 'విశ్వంభర' సాహిత్య పురస్కారం

ప్రముఖ తమిళ రచయిత్రి శివశంకరి

తెలుగు యూనివర్సిటీ, జూలై 4 : డాక్టర్ సి.నారాయణ రెడ్డి పేరిట నెలకొల్పిన విశ్వంభర జాతీయ సాహిత్య పురస్కారానికి సుప్రసిద్ధ తమిళ రచయిత్రి, ప్రతిష్టాత్మక సరస్వతీ సమ్మాన్ పురస్కార గ్రహీత శివశంకరిని ఎంపిక చేసినట్లు సుశీలానారాయణరెడ్డి ట్రస్టు అధ్యక్షురాలు సి. గంగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతి సందర్భంగా శివశంకరికి పురస్కారం, ఐదు లక్షల రూపాయల నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు ఆమె వెల్లడించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

కాచిగూడ,జూలై 4: ఫుట్‌పాత్‌ల ఆక్రమణదారులపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. కాచిగూడ కాచిగూడ డివిజన్‌లోని నింబోలిఅడ్డా బాలాజీ దేవాలయం ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. కోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ డీఎంసీ మారుతీ దివాకర్ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ పోలీసులు ఫుట్‌పాత్‌పై ఉన్న షాపులను తొలగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏసీపీ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాలకు అభివృద్ధి పనులు చేపట్టండి

అబిడ్స్, జూలై 4 : నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కి బీఆర్ఎస్ నాయకులు అభినందనలు తెలిపారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్ గురువారం జోనల్ కమిషనర్‌ను కలిసి బోనాల ఉత్సవాలకు అమ్మవారి ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

50మంది పేద రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్స

సుల్తాన్‌బజార్,జూలై 4: శారీరక అంగ వైకల్యం కలిగిన సుమారు 50 మంది పేద రోగులకి ఆర్థోపెడిక్ పునర్‌నిర్మాణ శస్త్ర చికిత్సను ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్(టీఓఎస్ఏ)అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ తిమ్మారెడ్డి అన్నారు. గురువారం ఉస్మానియా దవాఖానలో ఏర్పాటు చేసిన వలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 15న హకా భవన్‌లోని భరోసా కేంద్రంలో నిర్వహించిన శారీరక అంగ వైకల్య శిబిరానికి అపూర్వ స్పందన రావడంతో ఇటీవల ఆకార్ ఆశా హాస్పిటల్‌లో శల్య ఊర్జా ఉత్సవ్ పేరిట పునర్‌నిర్మాణ శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ అధ్వర్యంలో రీకన్‌స్ట్రక్టివ్ ఆర్థోపెడిక్ సర్జికల్ సర్వీసెస్(రోస్)ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఉపాధ్యక్షుడు అమర్ జూ లూరి, ఆకార్ ఆశా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ భరతేందు స్వేన్, డాక్టర్ రవీంద్రనాథ్‌తో తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్(టీఓఎస్ఏ) వైద్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హిందీ, తెలుగు సినీ సుస్వరాలు

రవీంద్రభారతి, జూలై 4: తెలంగాణ ప్రభుత్వం,భాషా సాంస్కృతిక శాఖ, మహతి రాజన్న నాథ ప్రియా సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో హిందీ,తెలుగు సినీసుస్వరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డెరెక్టర్, ప్రముఖ సంగీత విద్యాంసుడు చౌటి ఆనంద రఘునందన్‌లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సినీసుస్వరాల హిందీ,తెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చౌటి ఆనంద రఘునందన్ బృందంతో కలిసి అలనాటి హిందీ, తెలుగు సినీ గీతాలను ఆలపించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అసిస్టెంట్ డెరెక్టర్, సంగీత విద్యాంసుడు రఘునందన్‌ను రవీంద్రభారతి సిబ్బందివది, గాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

హరిప్రియ,షణ్ముఖ ప్రియకు జీవన సాఫల్య పురస్కారం

హరిప్రియ, షణ్ముఖ ప్రియను సత్కరిస్తున్న ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రవీంద్రభారతి,జూలై4 : దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ కె. రోశయ్య 91వ జయంతి సందర్భంగా శ్రీవాసవి ఆర్ట్స్ వాగ్గేయకార సప్తస్వరాలు ప్రియా సిస్టర్స్‌కు జీవన సాఫల్య పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పోలీస్ హౌజింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, విశిష్ట అతిథిగా ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి కోటి , కేపీపీ రామచంద్ర రావులు విచ్చేసి రోశయ్య చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళుర్పించారు. అనంతరం ప్రముఖ సంగీత విద్యాంసులు హరిప్రియ, షణ్ముఖ ప్రియలకు జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొణిజేటి రోశయ్య గొప్ప రాజకీయ నాయకుడని, నేటి తరం రాజకీయ నాయకులు రోశయ్యను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లో వచ్చారని తెలిపారు. సభకు ముందు ప్రియా సిస్టర్స్ ఆలపించిన పలు సంకీర్తలు వీక్షకులను రక్తికట్టించాయి. కార్యక్రమంలో వాసవి ఆర్ట్స్ వ్యవస్థాపకుడు ముక్కంటీశ్వర రావు,అమరవాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మక నవలా రచయిత కొలకలూరి ..

మాట్లాడుతున్న హాస్యావధాని శంకర నారాయణ

ముషీరాబాద్, జూలై 4: సందేశాత్మక నవలలు తెలుగు సమాజానికి అందించిన గొప్పకవి ఆచార్య కొలకలూరి ఇనాక్ అని హాస్యావధాని శంకర నారాయణ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరుగుతున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం నాక్ నవలా సాహిత్యంపై ప్రసంగించారు. గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఆచార్య త్రివేణి, డాక్టర్ సురేఖ, వెంకట్రావు, వసుమతి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన..

గోల్కొండ కోట సమీపంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గోల్కొండ కోటలో జరగనున్న బోనాల సందర్భంగా ఏవైనా ప్రమాదకర ఘటనలు జరిగినప్పుడు వెంటనే స్పందించి ప్రజలకు సేవలు అందించడానికి పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. దీని కోసం గుండె నొప్పి వచ్చి ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉంటే వారికి సీపీఆర్ చేసి బతికించవచ్చని గోల్కొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా సూచించారు. దీనికి సంబంధించి సీపీఆర్ ఏ విధంగా చేయాలనే దానిపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మురళీ, ఆర్ఎంఓ డాక్టర్ వినాయక రావు, డాక్టర్లు శ్రీనివాస్ రావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం

పార్లమెంట్‌లో అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయాలి

● మంత్రి సీతక్క

అల్లూరి జయంతి కార్యక్రమంలో మంత్రి సీతక్క, తదితరులు

చిక్కడపల్లి,జూలై 4 : మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని రాష్ట్రపంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు 127 జయంతిని పురస్కరించుకుని గురువారం ట్యాంక్ బండ్‌పై ఉన్న ఆయన విగ్రహం వద్ద క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సినీనటుడు దివంగత కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు హాజరై అల్లూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రజల కోసం ప్రాణ త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకొని, సాటి మనుషులకు సహాయం అందించే దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అన్నారు. క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెరిచర్ల నాగరాజు, నానిరాజులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అల్లూరి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, సేనా సమితి నాయకులు పాల్గొన్నారు.

రంజన శ్రీవాస్తవ మృతి ఉద్యోగులకు తీరని లోటు

తెలంగాణ నాన్ గెజిటెడ్ కేంద్ర సంఘం మాజీ మహిళా విభాగం చైర్‌పర్సన్, టీ మాక్స్ హౌజింగ్ సొసైటీ కోశాధికారి రంజన శ్రీ వాస్తవ మృతి తెలంగాణ ఉద్యోగులకు తీరని లోటని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ అన్నారు. ఈ మేరకు గురువారం రంజన శ్రీవాస్తవ భౌతికాయాన్నికి టీఎన్జీవో కేంద్ర సంఘం మాజీ అధ్యక్షులు స్వామిగౌడ్, దేవి ప్రసాద్‌రావు, ప్రస్తుత అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి శైలజ, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎంబీ క్రిష్ణాయాదవ్, టీఎన్జీవో నగరశాఖ అధ్యక్షుడు కట్కూరి శ్రీకాంత్, కార్యదర్శి హరికృష్ణ పంతులుతో కలిసి ఆయన పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

– సుల్తాన్‌బజార్, జూలై 4

వైద్య ప్రముఖులకు పురస్కారాలు

వైద్యులకు పురస్కారాలు అందచేసిన డాక్టర్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి

ముషీరాబాద్, జూలై 4 : ఆర్‌కే కళా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని..వివిధ విభాగాల్లో వందమంది వైద్యులకు పురస్కారాలను అందచేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌కే కళా సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు డాక్టర్ రంజిత్, బిక్కునాథ్‌నాయక్, నాని, చందు, ఆంజనేయులు, వసంతరాయలు, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ బోనాల్లో విశేష సేవలందించాలి

మెహిదీపట్నం, జూలై 4 : గోల్కొండ జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో కులవృత్తులవారు అందించే సేవలు మరువలేనివని సంఘ సేవకులు, ఆలయ కమిటీ సలహాదారు సిరుగుమల్ల రాజుపస్తాద్ అన్నారు. గోల్కొండ కోట ఆవరణలో కుల వృత్తుల సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబా చారి ఆధ్వర్యంలో కులవృత్తుల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు వస్తాద్ మాట్లాడుతూ.. నెల రోజులపాటు జరగనున్న బోనాల ఉత్సవాల్లో కులవృత్తుల వారు విశేష సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. అధ్యక్షుడు సాయిబాబాచారి, తదితరులు పాల్గొన్నారు.

రైల్లో స్నాచింగ్ ..

కాచిగూడ, జూలై 4: వేర్వేరు రైళ్లలో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికుల బ్యాగుల్లోంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలను తస్కరించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన మనీశ్‌కుమార్ అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా ధర్మాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు 3 తులాల బంగారు ఆభరణాలు, 2 వాచ్‌లు, 2 సెల్‌ఫోన్‌ను అపహరించారు.

– ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన పప్పిదేవి కాచిగూడ-లాల్‌గార్ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా ముత్‌కేడ్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె బ్యాగులో ఉన్న 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. గురువారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

అప్రజాస్వామిక చట్టాలతో దుష్పరిణామాలు

చిక్కడపల్లి,జూలై 4 : విరసం ఆవిర్భావ దినం సందర్భంగా గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'వికసిత్ భారత్ 2047– హిందూ రాష్ట్రం' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ మాట్లాడుతూ.. జూలై 1న కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికమైన నేర చట్టాలను అమలులోకి తెచ్చిందన్నారు. దీని వల్ల అనేక దుష్పరిణామాలు ఉత్పన్నమయ్యే స్థితి ఉందన్నారు. ఈ దేశ మూలవాసులైన ఆదివాసీ ప్రజలను మావోయిస్టుల పేరుతో ఏకపక్షంగా కాల్పులు జరుపుతూ, ఆపరేషన్ కగార్ పేరుతో 140 మందిని హత్య చేసిందని మండిపడ్డారు. సిటీ కన్వీనర్ రాము మాట్లాడుతూ.. బీజేపీ రూపొందించుకున్న వికసిత్ భారత్ ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించేది కాదని అన్నారు. సదస్సులో బాల్యాక్ జీవితం– సాహిత్య పుస్తకాన్ని బజరా, సమాయాత్త సమయం కవిత్య పుస్తకాన్ని కె.శివారెడ్డి ఆవిష్కరించారు .సమావేశంలో వీక్షణం సంపాదకులు వేణుగోపాల్, కృష్ణబాయి, సుదర్శన్, తాయమ్మ కరుణ, రామ్‌కి, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం..

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

దొడ్డి కొమురయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్య, ఎగ్గే మల్లేశం, క్యామ మల్లేశం, తదితరులు

రవీంద్రభారతి,జూలై 4: తెలంగాణ ఏర్పడి పదేండ్లయినా.. తెలంగాణ సాయుధపోరాటంలో అసువులు బాసిన దొడ్డి కొమురయ్య విగ్రహం రాష్ట్ర రాజధానిలో లేకపోవడం బాధాకరమని రోడ్లు భవనాలు, సినీమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతిలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశత్వానికి, దేశముఖ్‌ల వెట్టికి, ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడారని కీర్తించారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని .. ఆయన పోరాటం అసామాన్యమైందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, క్యామ మల్లేశ్, బీ.నారాయణ, నర్సింహా, అరుణ్‌కుమార్, నగేశ్, భూమన్న పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం ఎందరికో స్ఫూర్తి..

సుల్తాన్‌బజార్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణత్యాగంచేసి తొలి అమరవీరుడిగా దొడ్డి కొమురయ్య చిరస్థాయిగా నిలిచిపోయారని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా పేర్కొన్నారు. గురువారం నిజాం కళాశాల బీసీ సెల్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి ప్రొఫెసర్ భీమా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడిగా దొడ్డి కొమురయ్య చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉపేందర్ రెడ్డి, బీసీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఈవోసీ కోఆర్డినేటర్ డాక్టర్ దీకొండ తిరుపతితోపాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యానగర్‌లో..

అంబర్‌పేట : దొడ్డి కొము రయ్య 78వ వర్ధంతి సభను సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం విద్యానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ సిటీ సెక్రటరీ విజయ్,పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కె.గణేశ్, సుమన్, విక్రమ్‌జీ, వాసు, తదితరులు పాల్గొన్నారు.

'మాకు న్యాయం చేయండి..'

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న వినయ్‌కుమార్, బస్తీ వాసులు కృష్ణ, తదితరులు

చిక్కడపల్లి, జూలై 4 : గాంధీనగర్ డివిజన్, స్వామి వివేకానంద్‌నగర్ బస్తీ వాసులకు పునర్‌నివాసం కల్పించాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ నేతృత్వంలో గురువారం బస్తీవాసులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. బస్తీలో 19 ఇండ్లను కూల్చడంతో దళిత పేద కుటుంబాలు రోడ్డునపడ్డాయని, ఇండ్లు కూల్చి 7 నెలలు గడుస్తున్నా బాధితులకు న్యాయం చేయలేదన్నారు. పునర్‌నివాసం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో బీస్తీవాసులు ఎంబీ కృష్ణ, ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

సీడీఎఫ్‌డీలో ఆర్‌బీవీఆర్ కాలేజీ విద్యార్థులు

సిటీబ్యూరో, జూలై 4(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ పరిశోధన కేంద్రాన్ని నగరంలోని బాగ్ లింగంపల్లిలో గల రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి మహిళ కళాశాల విద్యార్థులు సందర్శించారు. విద్యార్థుల బృందం, రీసెర్చ్ సెంటర్‌లోని పలు పరిశోధన లేబోరేటరీలను పరిశీలించారు. అనంతరం, సీడీఎఫ్‌డీ పరిశోధకులు వారికి కెరీర్ ఓరియెంటేషన్ అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లైఫ్ సైన్సెస్ రంగంలో ఉన్న ఉద్యోగ, ఉపాధి, ఉన్నత విద్యావకాశాలపై సమగ్రమైన విషయాలను విద్యార్థులకు తెలిపినట్లుగా సీడీఎఫ్‌డీ వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా లైఫ్ సైన్సెస్ రీసెర్చ్‌లో ఉన్న పరిశోధన అవకాశాలను తెలుపుతూ వారికి ఉన్నత విద్యావకాశాలపై అవగాహన కల్పించారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మెహిదీపట